క్లుప్తంగా

నచ్చిన రంగాల్లో రాణించాలి

ఎస్ఐ షేక్ యూనూస్



జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థులు

మద్దూరు(హుస్నాబాద్): విద్యార్థులు తమకు నచ్చిన రంగాల్లో రాణించేందుకు పాఠశాల స్థాయి నుంచే కృషి చేయాలని ఎస్ఐ షేక్ యూనూస్ అహ్మద్ అలీ అన్నారు. మండలంలోని లద్నూరు గ్రామంలో గురువారం రాత్రి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రవీందర్ అధ్యక్షతన పాఠశాల వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ గజ్జుక సమ్మయ్య, మాజీ సర్పంచ్ జీడికంటి సుదర్శన్, ఎస్ఎంసీ చైర్మన్ శారద, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ అన్నోజు భాస్కర్‌చారి, విద్యావేత్త రామ్మూర్తి, ఉపాధ్యాయులు హరిప్రసాద్, ఉపేందర్, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా సభలను విజయవంతం చేయండి



మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్

దుబ్బాకటౌన్: ఏప్రిల్ 3, 4వ తేదీల్లో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా 5వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అరవింద్ అన్నారు. శుక్రవారం దుబ్బాకలో మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎస్ఎఫ్ఐ భవిష్యత్ కార్యాచరణ కోసమే మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంలో విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం యూనివర్సిటీలను ప్రైవేటీకరణ చేసేపనిలో ఉందని విమర్శించారు. రానున్న కాలంలో విద్యార్థులు పోరాటలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాధిక్, నాయకులు స్వామి, అరవింద్, ప్రశాంత్, నందిని, కావ్య, నవ్య, చందు, తదితరులు పాల్గొన్నారు.

లచ్చపేట క్రికెట్ టోర్నీ విజేత హబ్షీపూర్



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో 15 రోజులుగా నిర్వహిస్తున్న లచ్చపేట క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ శుక్రవారం రసవత్తరంగా జరిగింది. ఫైనల్స్‌లో లచ్చపేట, హబ్షీపూర్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్‌కు దిగిన హబ్షీపూర్ జట్టు నిర్ణీత 14 ఓవర్లలో 91 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో లచ్చపేట జట్టు తడబడటంతో 18 పరుగులతేడాతో హబ్షీపూర్ జట్టు విజయం సాధించింది. విజేతగా నిలిచిన హబ్షీపూర్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.8 వేల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నంద్యాల శ్రీకాంత్, ఆర్గనైజర్లు నరేష్, ప్రవీణ్, పరమేష్, సతీష్ గౌడ్, దీపక్, అరుణ్, నాని తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డును క్యూరింగ్ చేయండి



దెబ్బతిన్న సీసీ రోడ్డు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో నిర్మించిన సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో దెబ్బతింటోంది. ఇటీవల గ్రామంలో రూ.5 లక్షల పంచాయతీ రాజ్ నిధులతో సీసీ రోడ్డు నిర్మించారు. రోడ్డు వేసిన మొదటి రోజు మాత్రమే నీళ్లుపోశారని, మళ్లీ పోయకపోవడంతో ఎండలకు రోడ్డు దెబ్బతింటోందని కాలనీ వాసులు తెలిపారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్ శాఖ మండల ఏఈ తిరుపతిరెడ్డిని వివరణ కోరగా సీసీ రోడ్డుపై నీరు నిలిచేందుకు ఏర్పాటు చేసిన మడులపై నుంచి వాహనాలు వెళ్లడంతో కట్టలు తెగిపోయాయన్నారు. క్యూరింగ్‌కు చర్యలు చేపడతామన్నారు.

ఊటబావుల పూడికతీత ఎప్పుడు?

పంటల సాగుకు నీరు అవసరం. నాలుగేళ్లుగా వరుసగా వర్షాలు కురియడంతో రైతులకు వ్యవసాయ బావుల్లో పూడిక తీసే అవసరం రాలేదు. ఇప్పుడు ఎండలు ముదరకముందే బావుల్లో నీళ్లు అడుగంటాయి. దీంతో పంటలకు నీటి తడులు అందించేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఉపాధి హామీ పనుల్లో గతంతో పూడిక తీత పనులు చేశారు. ఆ పనులు ఎవరూ చేయించుకోకపోవడంతో వాటికి తొలగించారు. మళ్లీ పూడిక తీత పనులు చేర్చాలని కోరుతున్నారు.

- నాలుగేళ్ల వరుస వర్షాలతో పూడిక తీయని రైతులు
- ప్రస్తుత ఎండలకు అడుగంటిన భూగర్భ జలాలు
- ఎండుతున్న వ్యవసాయ బావులు
- ఆందోళనలో రైతాంగం

హుస్నాబాద్‌రూరల్: వ్యవసాయ బావుల్లో నీళ్లు అడుగంటాయి. పంటలకు నీటి తడులు అందించేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. బావుల్లో పూడిక పెరుకుపోయింది. ఊట నీరు తగ్గడంతో ఎండు ముఖం పట్టాయి.. పంటలను కాపాడుకొనేందుకు రైతులు చెరువు, కుంటల నుంచి పైపులైన్ల ద్వారా పంటలకు నీటి తడులు అందిస్తున్నారు. బావుల తవ్వకం రైతులకు ఆర్థిక భారమవుతుందని గతంలో కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకంలో బావుల తవ్వకం, పూడికతీత పనులు చేపట్టడంతో చాలా మంది రైతులు ప్రయోజనం పొందారు. నాలుగేళ్ల నుంచి వర్షాలు కురియడంతో రైతులకు బావుల పూడికతీసే అవకాశం రాలేదు. పూడికతీత పనులు రైతులు చేయించుకోవడంలేదని ఉపాధి హామీ పథకం నుంచి బావుల పూడికతీత పనులు తొలగించారు. దీంతో గ్రామీణ సన్న, చిన్నకారు రైతులు ఇబ్బందిపడుతున్నారు. పూడిక తీత పనులు ఆర్థిక భారం కావడంతో కొందరు రైతులు పంటలను వదిలేస్తున్నారు.

పంట ఎండుతోంది



బావుల్లో ఊటనీరు తగ్గి మొదటి మడికి నీళ్లు పారడంలేదు. ఇలా కరువు వస్తుందని అనుకోలేదు. ప్రాజెక్టు అయ్యింది కదా నీళ్లకు కరువు ఉండదని అనుకున్నాం. బావుల్లో నీళ్లు లేక పంటలు ఎండిపోయాయి. రెండేళ్ల కిందట ఉపాధి హామీ పథకంలో పాత బావుల పూడికతీత పనులు జరిగేవి. ఇప్పుడు ఆ పనులు లేవు. బావుల పూడికతీద్దామంటే రూ.20 వేలు ఖర్చు అవుతుంది.

– నటికం సంపత్, గాంధీనగర్

రైతుకు ఉపయోగపడే పనులు చేయాలి



ఉపాధి హామీ పథకం బాగానే ఉంది. రైతులకు వ్యవసాయ పనులకు ఉపయోగపడే పనులు చేపడితే మాకు కొంచెం భారం తగ్గుతుంది. నీళ్లకు కరువు వచ్చింది. బావుల్లో నీళ్లు లేకపాయే. పంట ఎండిపోయింది. ఉపాధి హామీ పథకంలో పూడికతీత పనులు పెడితే రైతులకు మేలు జరుగుతుంది. బావి తవ్వదామంటే డబ్బులు లేవు.

– తిరుపతిరెడ్డి, పోతారం(ఎస్)



మీర్జాపూర్‌లో బావి పూడికతీస్తున్న రైతు బాలురెడ్డి

ఉపాధిహామీ పథకంలో చేర్చాలని..

జాతీయ ఉపాధి హామీ పథకంలో సన్న, చిన్నకారులు రైతులకు ఉపయోగపడే వ్యవసాయ బావుల పూడికతీత పనులు చేర్చితే చాలా మంది రైతులు ఉపయోగించుకుంటారు. వ్యవసాయ అనుబంధ పనులు చేయించినప్పుడు బావుల తవ్వకం పనులు మంజూరు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వేసవిలో దుక్కి దున్నడం, భూమి చదును చేయడం, సరిహద్దు కందకాలు, వ్యవసాయ బావుల వరకు రోడ్డు నిర్మాణం, పాడి పశువులకు పాకల నిర్మాణం, ధాన్యం ఆరబెట్టుకునేందుకు కల్లాల నిర్మాణం, బావుల పూడిక తీయడానికి క్రేన్ చార్జీలు మంజూరు చేయాలని కోరుతున్నారు. చెరువు మట్టిని పంట భూములకు తరలిస్తే సేంద్రియ ఎరువుగా పనిచేసి పంటల దిగుబడులు పెరుగుతాయని ప్రభుత్వ అధికారులు చెరువు మట్టి తరలింపు పనులు కూడా కల్పించాలంటున్నారు.



పోతారం(ఎస్) అడుగంటిన జలం

సమయపాలన పాటించని వైద్య సిబ్బంది

- ఇష్టారాజ్యంగా విధులకు హాజరు
- ఇబ్బందిపడుతున్న రోగులు



మూసిఉన్న అక్కన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సమయ పాలన పాటించడంలేదు. ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రి తలుపులు ఎప్పుడూ మూసి ఉంటున్నాయని, దీంతో వైద్యం కోసం వచ్చినవారు వెనుదిరిగి వెళ్తున్నారని చెబుతున్నారు. ఆదివారం, ఇతర సెలవురోజుల్లో ఉదయం 9 నుంచి 1 గంట వరకు ఆసుపత్రి తెరిచి ఉంచాలనే ఆదేశాలున్నా వైద్య సిబ్బంది పట్టించుకోవడం లేదు. శుక్రవారం 'గుడ్ ఫ్రైడే' కావడంతో అక్కన్నపేట పీహెచ్‌సీ నిర్ణీత సమయంకంటే ముందుగానే మూసివేయడంతో పలువురు రోగులు వచ్చి వెనుదిరిగి వెళ్లారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మారుమూల పల్లెలు, గిరిజన తండాలు ఎక్కువగా ఉంటాయి. ఏ సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయో తెలియదు. గతంలో సకాలంలో వైద్యం అందక ప్రాణాలు సైతం కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

తెలంగాణ ఫిషరీష్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్



మాట్లాడుతున్న తెలంగాణ ఫిషరీష్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్

కొముురవెల్లి(సిద్దిపేట): మత్స్యకారుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, మత్స్యకారులు లక్షాధికారులు కావాలని తెలంగాణ ఫిషరీష్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్, ప్రకృతి పర్యావరణ సంస్థ ప్రెసిడెంట్ మాధవరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పకృతి పర్యావరణ సంస్థ, కొండపాక ఫిషరీష్ ప్రొడ్యూసర్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారులు అభివృద్ధి సాధించేందుకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ సహకారంతో ఏర్పాటైన మత్స్యకార ఉత్పత్తి దారుల సంఘాలను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి గీస భిక్షపతి, నారదాసు ఈశ్వర్, కొండపాక ఫిషరీష్ చైర్మన్ తిరుపతి రాజు, మేడికుంట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే



రాముునిపట్లలోని చర్చిలో క్రీస్తు సందేశం వినిపిస్తున్న రెవ.దినేష్

చిన్నకోడూరు(సిద్దిపేట): గుడ్ ఫ్రైడేని క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం మండలంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ఫాదర్లు దైవ సందేశం వినిపించారు.

హుస్నాబాద్: హుస్నాబాద్‌లోని హోలీ బిలీవర్స్ చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తును స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి ఫాస్టర్ బొల్లం నవీన్ కుమార్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధించిన శాంతి, ప్రేమ, కరుణ అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు బొల్లం శ్రీలత, రాజయ్య, లారెన్స్, మురళి పాల్గొన్నారు.



బెజ్జంకిలో క్రీస్తు శిలువ యాత్ర

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలో గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. బెజ్జంకి క్రాసింగ్‌లోని సెయింట్ మేరీస్ చర్చిలో ఫాదర్ గాదె ప్రశాంత్ రెడ్డి ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. చర్చి నుంచి ప్రధాన వీధులలో శిలువ యాత్ర నిర్వహించారు.

పన్ను చెల్లించని పాఠశాలకు తాళం



శ్రీ చైతన్య స్కూల్‌కి తాళం వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలో ఆస్తి పన్ను బకాయిపడ్డ శ్రీ చైతన్య స్కూల్‌కు శుక్రవారం మున్సిపల్ అధికారులు తాళం వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఆస్తి పన్ను బకాయి ఉన్న పాఠశాలలు, కళాశాలలు, ఫంక్షన్ హాళ్లు, పెట్రోల్ బంక్‌లు, సినిమా థియేటర్ల యజమానులు వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను చెల్లించేవారికి వడ్డీలో 90 శాతం రాయితీ ఇస్తుందని, ఈ అవకాశం ఈనెల 31వ తేదీ వరకు మాత్రమే ఉందన్నారు. అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్, సిబ్బంది సర్వర్, శ్రీనివాస్, శశిప్రీతం, గంగాధర్, వెంకటేష్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శిగా సంజీవ్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట డివిజన్ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెప్యాల సంతోష్, కార్యదర్శిగా కొండం సంజీవ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా షారుక్‌ఖాన్, అరుణ్, సహాయ కార్యదర్శులుగా గ్యారవంశీ, వినోద్, కమిటి సభ్యులుగా మణికాంత్, తేజ, అభిషేక్, నవదీప్ ఎన్నికయ్యారు.

ఎంపీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి



అయినాపూర్‌లో ఉపాధి హామీ కూలీల సమస్యలు తెలుసుకుంటున్న బీజేపీ నాయకులు

కొముురవెల్లి(సిద్దిపేట): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బురుగోజు నాగరాజు కోరారు. శుక్రవారం మండల నాయకులు, కార్యకర్తలతో కలసి మండలంలోని అయినాపూర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలను కలసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో పర్యటిస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి

సిద్దిపేటరూరల్: కాంగ్రెస్ పార్టీ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సిద్దిపేట రూరల్ మండలంలోని బుస్సాపూర్ మాజీ సర్పంచ్ సదాశివారెడ్డి, వెంకటాపూర్ మాజీ సర్పంచ్ భర్త మల్లయ్య, తోర్నాల మాజీ సర్పంచ్ దేవయ్య, రాంపూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కొడూరు రాజు, బుస్సాపూర్ ఉపసర్పంచ్ భగవాన్ రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం దొరల చేతుల్లోకి వెళ్లి రాష్ట్రం సర్వనాశమైందని విమర్శించారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు ఇలాకలోని సర్పంచ్‌లు పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. త్వరలో చేరిక కార్యక్రమం చేపడతామన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల పరిధిలోని పీర్లపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీ మల్లికార్జున స్వామి, రేణుక ఎల్లమ్మ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ శుక్రవారం వైభవంగా జరిగింది. విగ్రహాలకు జలాధివాసం, ధాన్యాదివాసం, సామూహిక రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మైనంపల్లి హన్మంతరావు

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్ల గ్రామ మాజీ ఉపసర్పంచ్, ఉపసర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ళ రమేష్ బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం కొంపల్లిలోని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తన స్వగృహంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుండటంతో పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మండల అధ్యక్షుడు లింగారావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వర్గల్‌లో పోలీసుల కవాతు



కవాతు చేస్తున్న పోలీసులు

వర్గల్(గజ్వేల్): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా గౌరారం పీఎస్ పరిధిలోని వర్గల్‌లో శుక్రవారం పోలీసు బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, గౌరారం ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్, కేంద్ర బలగాలు ఇన్సిడెంట్ ఫ్రీ ఎన్నికలు లక్ష్యంగా కవాతు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

బెజ్జంకి(సిద్దిపేట): శ్రీలక్ష్మీనర్సింహ స్వామి టిప్పర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం బెజ్జంకిలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వాసిమల్ల రమేష్, ఉపాధ్యక్షుడిగా అడుకని నర్సింగం, ప్రధాన కార్యదర్శిగా ఎరవెల్లి వెంకటేష్, సహాయ కార్యదర్శిగా దొనె లింగారావు, కోశాధికారిగా దూమాల సురేష్, కార్యవర్గ సభ్యులుగా మహేష్, లచ్చిరెడ్డి, స్వామి, శ్యామ్ ఎన్నికయ్యారు.

బీజేవైఎం మండల అధ్యక్షుడిగా..



కొండపాక(గజ్వేల్): కొండపాక మండల బీజేవైఎం అధ్యక్షుడిగా అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి ప్రవీణ్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి నుంచి శుక్రవారం నియామకపత్రం అందింది. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా నియమించినందుకు సంతోషంగా ఉందన్నారు. తన నియామకానికి సహకరించిన అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

అవిశ్వాసంపై నేడు సమావేశం

కొండపాక(గజ్వేల్): కొండపాక మండల ఎంపీపీ ఉపాధ్యక్షుడిపై ఎంపీటీసీ సభ్యులు ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మాన సమావేశం శనివారం ఉదయం 11.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశానికి ఆర్డీఓ బన్సీలాల్ హాజరవుతారన్నారు. బీఆర్ఎస్ ఎంపీపీపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ఇటీవల నెగ్గిన విషయం పాఠకులకు తెలిసిందే. రెండు రోజుల వ్యవధిలో వైస్ ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టడం చర్చనీయాంశంగా మారింది.

చెరువుల సంరక్షణకు కృషి చేయాలి

ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విజయభాస్కర్‌రెడ్డి



ధర్మారెడ్డిపల్లి చెరువును శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

గజ్వేల్‌రూరల్: చెరువులను సంరక్షించుకునేందుకు అందరూ కలసికట్టుగా కృషి చేయాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లిలో శుక్రవారం గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ప్రత్యేక శిబిరంలో భాగంగా రెండో రోజు వలంటీర్లు చెరువు పరిసరాలు, ప్రాథమిక పాఠశాల ఆవరణను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల ద్వారా ఎంతో మేలు జరుగుతుందని, వ్యవసాయం చేసేందుకు ప్రధాన ఆధారమన్నారు. ప్రజలు చెత్తా చెదారాన్ని చెరువులో వేస్తే నీరు కలుషితమవుతుందని, చెరువును పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జేజేల వెంకటేశంగౌడ్, అధ్యాపకులు రాజు, సాయికృష్ణ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

మెదక్‌లో కాంగ్రెస్ విజయం ఖాయం: చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన నీలం మధు

తొగుట(దుబ్బాక): మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు విజయం ఖాయమని ఆ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో శ్రీనివాస్‌రెడ్డిని నీలం మధు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఇందిరా గాంధీని గెలిపించిన మెదక్ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి కాంగ్రెస్ పార్టీని విజయతీరాలకు చేర్చాలని కోరారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దుబ్బాకలో భారీ మెజార్టీని అందిస్తామని హామీనిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమం కోసం ఐదు గ్యారంటీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని బీఆర్ఎస్ నాయకులు లూటీ చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిష్టయ్య, నాయకులు వెంగల్‌రావు, నరేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.